నమస్తే తెలంగాణ
# రాజన్న సిరిసిల్ల
5 | కరీంనగర్, సోమవారం 26 మే 2025 | RAJANNA SIRCILLA



## బస్తాల్లోనే మొలకెత్తినయ్

నాకున్న రెండెకురాల పంట పొలంలో బోనస్ వస్తుందన్న ఆశతో సన్న వడ్లు పండించిన. సెంటర్‌లో ధాన్యం పోసి నెలరోజులు దాటింది. వారం కిందట వడ్లను కాంటా వేసిన్రు. 180 వరకు బస్తాలు అయినయ్. కానీ, ఇప్పటివరకు లోడ్ చేయలే. నాలుగైదు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు బస్తాలు పూర్తిగా తడిసి, మొలకచ్చినయ్. వడ్లు ఎప్పుడు లోడ్ చేస్తరని అడిగితే మిల్లుల్లో వడ్లు నిండిపోయినయని, సన్న వడ్లు అవసరం లేదని మిల్లులోళ్లు సెంటరోళ్లతో చెపుతున్నరట. లారీలోళ్లు కూడా సన్న వడ్లు తీసుకెళ్తలేరు. అధికారులు సన్న వడ్లు లోడ్ చేయించి తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలి.

**-భువనగిరి పర్శయ్య, రైతు, (కోనరావుపేట)**

కోనరావుపేటలో మొలకెత్తిన తూకం వేసిన ధాన్యం బస్తాలను చూపిస్తున్న రైతు పర్శయ్య

# కల్లాల్లో కన్నీళ్లు

- మొలకెత్తిన ధాన్యం
- ఆరబోసేందుకు రైతన్న అరిగోస

కోనరావుపేట, మే 25: రైతులు ఆరుగాలం కష్టపడి ధాన్యం పండిస్తే.. దానిని అమ్ముకోవడానికి రెండింతలు అరిగోస పడాల్సి వస్తున్నది. కొనుగోళ్లు, కాంటా వేసిన బస్తాలను తరలించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తుండడం.. అకాల వర్షాల కారణంగా కోనరావుపేట మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో రైతులు దయనీయ పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కుప్పలతో పాటు బస్తాల్లోని ధాన్యం తడిసి మొలక వస్తోంది. దీంతో రైతులు రేయింబవళ్లు కేంద్రాల్లోనే ఉంటూ ఆరబోసేందుకు అరిగోస పడుతున్నారు. సన్న వడ్లు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తుండడంతో రైతులు ఎక్కువగా కొనుగోలు కేంద్రాలనే ఆశ్రయించగా, ఇప్పటివరకు మిల్లులు కేటాయించకపోవడం, కేటాయించిన మిల్లులు ధాన్యం దించుకోకపోవడంతో సెంటర్లలోనే మూలుగుతోంది. బోనస్ మాట దేవుడెరుగు వర్షాలతో అంతకంటే ఎక్కువగా నష్టపోయే పరిస్థితి దాపురించిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ప్రతి చివరి గింజనూ కొంటామని ప్రభుత్వం మాటల్లో తప్ప చేతల్లో ఎక్కడా చూపిస్తున్న దాఖలులేవు. తూకం వేసిన బస్తాలు 15 రోజులకు పైగా సెంటర్లలోనే ఉండిపోవడంతో ప్రతి లారీలో సుమారు 5 నుంచి 10 క్వింటాళ్ల తరుగు వస్తుంది. దీంతో మిల్లు నిర్వాహకులను అడిగితే సెంటర్ నిర్వాహకులకు తెలుసు అంటూ దాటవేస్తున్నారు. మండలంలోని వట్టిమల్ల, వెంకట్రావుపేట, కోనరావుపేట, నిజామాబాద్ గ్రామాలతో పాటు పలు గ్రామాలలో ధాన్యం రాశులు ఎక్కడివక్కడే పేరుకుపోయాయి. శివంగాళపల్లి, కోనరావుపేట, వట్టిమల్ల, మరిమడ్లతో పాటు పలు గ్రామాలకు చుట్టూ అటవీప్రాంతం కావడంతో వరిధాన్యం కుప్పలు పందుల పాలవుతున్నాయి.



కరీంనగర్‌లోని త్యాగరాజ లలిత కళా పరిషత్తు భవనం కూల్చి వేసిన ఎక్స్‌కవేటర్

# ఆ భవనం మాది
# మీరెట్ల కూలుస్తరు?

- కరీంనగర్‌లో వివాదాస్పదమవుతున్న త్యాగరాజ లలిత కళా పరిషత్తు కూల్చివేత
- అధికారుల తీరుపై కళాకారుల ఆగ్రహం
- ఆ కళాసౌదం ప్రభుత్వానిది కాదని వెల్లడి
- దాదాపు ఐదు దశాబ్దాల కింద చందాలు పోగు చేసి కట్టుకున్నామని ఆవేదన
- కూల్చిన చోటే మరో వేదిక నిర్మించాలని వినతి
- లేదంటే దశల వారీగా ఆందోళనలు తప్పవని హెచ్చరిక

**నాలుగున్నర దశాబ్దాల క్రితం ఉమ్మడి జిల్లా కళాకారులు చందాలు పోగు చేసుకుని నిర్మించుకున్న భవనం అది. మేటి కళాకారులెందరో ప్రదర్శనలు ఇచ్చి పోగు చేసిన సొమ్ముతో నిర్మించుకున్న కళల సౌధమిది. ఎందరో కళాకారులకు పురుడోసిన సాంస్కతిక వేదిక అది. అధికార యంత్రాంగం తీసుకున్న ఒక్క నిర్ణయంతో ఆ పుట్టినిల్లు నేల మట్టమైంది. కళలను కాపాడేందుకు ఆనాటి అధికారులు ప్రోత్సహిస్తే, ఇప్పుడు ఆ కళామ తల్లి గుండెలపై బుల్డోజర్లు దించిన ఘనత ఈ నాటి అధికారులకే దక్కుతుందని ఉమ్మడి జిల్లా కళాకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్‌లోని త్యాగరాజ లలిత కళా పరిషత్తు భవనం కూల్చివేతపై సర్వత్రా తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. 47 ఏండ్ల కింద నిర్మించిన ఈ భవనం ఎందరో కళాకారులను ప్రోత్సహించి, సాంస్కృతిక రంగంలో నిలబెట్టిందని చెబుతున్న కళాకారులు, కూల్చిన చోటనే కొత్త భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.**

కరీంనగర్, మే 25(నమస్తే తెలంగాణ)కరీంనగర్‌లోని త్యాగరాజ లలిత కళా పరిషత్తుకు పెద్ద చరిత్రనే ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నపుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 1976 నవంబర్ 1 నుంచి 20 వరకు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలకు కరీంనగర్ జిల్లా వేదికైంది. అప్పటి కలెక్టర్ జీపీ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. నాటకాలు, జానపదాలు, ఇతర కళా రూపాలన్నీ ఒకే వేదికను పంచుకున్నాయి. అప్పటి నుంచి కరీంనగర్‌లోని కళాకారులు చాలా మంది వెలుగులోకి వచ్చారు. ఎంతో ఉత్సాహంతో వివిధ కళలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటున్న కళాకారులను మరింత ప్రోత్సహించేందుకు ఒక వేదిక కావాలని జిల్లాలో ఉండే నాటక సమాజం ఆలోచించింది. అందులో భాగంగా 1980లో కళాసదస్సును ఏర్పాటు చేసింది. ఈ సదస్సు ఏర్పడిన తర్వాత ప్రతినెలా నాటక ప్రదర్శనలు నిర్వహించే వారు. జిల్లా కలెక్టర్లు సహా కళలను ప్రోత్సహించే ప్రతి అధికారి ఈ కార్యక్రమాల్లో విధిగా పాల్గొనేవారు. ఈ క్రమంలో కేఎస్ శర్మ కలెక్టర్‌గా ఉన్న సమయంలో కళారంగాన్ని మరింత ప్రోత్సహించే లక్ష్యంతో, నాటక రంగం బతికి ఉండాలంటే ఒక నిర్దిష్టమైన ఆదాయం ఉండాలని తలచారు. అందులో భాగంగానే కరీంనగర్ వన్‌టౌన్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. 1980లోనే ఇక్కడ ఒక భవనాన్ని నిర్మించాలని నిర్ణయించిన కళాకారులు, కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో ప్రముఖ నటులు జేవీ సోమయాజులు, రమణ వంటి ప్రముఖ సినీ కళాకారులతో కన్యాశుల్కం నాటకాన్ని ప్రదర్శించారు. అంతేకాకుండా ఎంఎస్ సుబ్బులక్ష్మి వంటి ప్రముఖ గాయకురాలితోకూడా ప్రదర్శనలు ఇప్పించారు. ఈ కార్యక్రమాలకు టికెట్లు కేటాయించగా కొంత ఆదాయం వచ్చింది. కొందరు దాతలు కూడా చందాల రూపంలో ఆర్థికంగా సహకరించారు. అలా రెండంతస్తుల భవనాన్ని నిర్మించుకుని త్యాగరాజ లలిత కళా పరిషత్తుగా నామకరణం చేసుకున్నారు.

### క్రమంగా మసక బారిన కళ

త్యాగరాజ లలిత కళా పరిషత్తు ఏర్పాటు తర్వాత కొంత కాలం ఈ భవనం కళలకు వేదికగా మారింది. నాటకాలు రిహార్సల్ చేసుకునేందుకు ఎందరికో ఉపయోగపడింది. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కళా పరిషత్తుకు ఎవరు కలెక్టర్ ఉంటే వారే చైర్మన్‌గా వ్యవహరించే వారు. అయితే, భవనాన్ని అద్దెకు ఇవ్వడం వల్ల వచ్చే ఆదాయంతో కళలను మరింత ప్రోత్సహించవచ్చని కళాకారులు, అధికారులు భావించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా హౌసింగ్ బోర్డులకు అద్దెకు ఇచ్చారు. చాలా కాలం ఈ రెండు ప్రభుత్వ కార్యాలయాలు ఇదే భవనంలో నిర్వహించబడ్డాయి. 1990లో ఐవీ సుబ్బారావు కలెక్టర్‌గా ఉన్నపుడు ప్రభుత్వ కార్యాలయాలను ఇక్కడి నుంచి ఖాళీ చేయించారు. ఆ తర్వాత ప్రైవేట్ వ్యక్తులకు అద్దెకు ఇస్తూ వచ్చే ఆదాయంతో కొంత కాలం కళాకారులకు మంచి ప్రోత్సాహం లభించింది. ఆ తర్వాత ఏమైందో ఏమోగాని దీని ఉద్దేశం క్రమంగా గాడి తప్పింది. కళలను ప్రోత్సహించే లక్ష్యంతో చేపట్టిన ఆశయం మసకబారింది. సుమిత్రా డావ్రా కలెక్టర్‌గా ఉన్నపుడు ఈ పరిషత్తు గురించి కొంత శ్రద్ధ తీసుకున్నారు. అధికారుల చేతి నుంచి తప్పించి శాశ్వత కేర్ టేకర్లను నియమించారు. త్యాగరాజ లలిత కళాపరిషత్తును ఉమ్మడి జిల్లా నుంచి కొందరు కళాకారులు శాశ్వత సభ్యులుగా ఉండి నిర్వహిస్తూ వచ్చారు. కేఎస్ శర్మ కలెక్టర్‌గా ఉన్నపుడు ఏ ఉద్దేశంతోనైతే ఈ కళా పరిషత్తును ఏర్పాటు చేశారో ఆ ఉద్దేశంతో పాటు ఇపుడు భవనం కుప్ప కూలింది

### కల్చరల్ మ్యూజియాన్ని ఏర్పాటు చేయాలి..



ఉమ్మడి జిల్లా నుంచి ఎందరో కళాకారులను తయారు చేసి, ఎన్నో కళారూపాలను ప్రోత్సహించిన త్యాగరాజ లలిత కళా పరిషత్తు భవనం నేల కూల్చడం అన్యాయం. అధికారులు తీసుకున్న ఈ చర్య కళాకారులను కలిచి వేసింది. పరిషత్తు కేర్ టేకర్లుగా ఉన్న తమను విచారించకుండానే అధికారులు కూల్చి వేత నిర్ణయం తీసుకున్నారు. ఉన్నతాధికారులకు అందిన తప్పుడు సమాచారంతోనే ఇలా జరిగిందని మేము భావిస్తున్నాం. ఈ భవన నిర్మాణానికి ఎలాంటి ప్రభుత్వ నిధులు వినియోగించ లేదు. కళాకారులు సేకరించుకున్న చందాలతోనే నిర్మాణం జరిగింది. ఈ స్థలాన్ని మరో సంస్థకు కేటాయించ రాదు. కూల్చిన చోటనే తిరిగి నిర్మించాలి. ఒక కల్చరల్ మ్యూజియాన్ని ఏర్పాటు చేయాలి. అంతే కాకుండా కళాకారుల, సాహితీ మిత్రుల సమావేశాలకు అనువైన హాల్‌తోపాటు వసతి గృహాన్ని నిర్మించాలి. లేదంటే ఆందోళనలు తప్పవు.

**- వైఎస్ శర్మ, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సంస్థల కళాకారుల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు**

### తిరిగి కళాకారులకే కేటాయించాలి..

త్యాగరాజ లలిత కళా పరిషత్తును కూల్చివేసే నిర్ణయం తీసుకోవడంలో పెద్ద తప్పు జరిగింది. అధికారులకు అందిన తప్పుడు సమాచారంతోనే ఈ నిర్ణయం తీసుకుని ఉంటారని నేను భావిస్తున్నా. ఎందరో కళాకారులను తయారు చేసిన సంస్థ ఇది. ఒకప్పుడు నేను కూడా ఇక్కడే రిహార్సల్స్‌లో పాల్గొనేవాన్ని. కళాకారుల చమటతో నిర్మించుకున్న భవనాన్ని వారికి చెప్పకుండా ఎలా డిస్మెంటల్ చేస్తారు.? కేఎస్ శర్మ కలెక్టర్‌గా ఉన్నపుడు నిర్మించిన భవనం ఇది. ఈ భవనంపై వచ్చిన అద్దెతో



నాటకాలు, ఇతర కళల ప్రదర్శన చేసే వాళ్లం. పేద కళాకారులకు కూడా పెన్షన్ ఇచ్చే వాళ్లం. అప్పట్లో ఆక్టివ్‌గా ఉన్న వాళ్లంతా సినిమాలు, టీవీ సీరియల్స్ ఆర్టిస్టులుగా ఎదిగారు. ఇపుడు దీనిని పట్టించుకునే వారు లేక పోవడంతో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కూల్చిన చోటనే తిరిగి భవనాన్ని నిర్మించి కళాకారులకే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా. లేదంటే రాష్ట్ర స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించాల్సి వస్తోంది.

**- కేతిరెడ్డి మల్లారెడ్డి, ప్రముఖ సినీ, సీరియల్స్ ఆర్టిస్టు**

### ఎంతో శ్రమించి నిర్మించుకున్నం..

త్యాగరాజ లలిత కళా పరిషత్తు లాంటి భవనం ఉమ్మడి రాష్ట్రంలోనే ఎక్కడా లేకుండే. అప్పట్లో దీనిని ఎంతో శ్రమించి నిర్మించుకున్నం. అప్పటి కలెక్టర్ కేఎస్ శర్మ స్థలాన్ని కేటాయించారు తప్పా ప్రభుత్వం



నుంచి ఒక్క రూపాయి ఇవ్వ లేదు. ఈ భవనం కళాకారుల శ్రమ. అది మా కళాకారులకే చెందాలి. నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కళా పరిషత్తు నిధులు కూడా అధికారుల చేతిలోనే ఉండేవి. కొంత కాలం తర్వాత కమిటీ ఏర్పాటు చేసుకుని నిర్వహించుకున్నం. ఇపుడు ఆ పరిస్థితి లేదు. కళలకు పుట్టిల్లుగా ఉన్న కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు ఇది చెరగని చిహ్నంగా ఉండేది. ఇంతటి భవనాన్ని కూల్చి వేయడం తీవ్రంగా కలిచి వేస్తోంది. ఇప్పుడు ఇక్కడే భవనాన్ని పునర్నిర్మాణం చేపట్టాలి. కళాకారుల సొత్తు కళాకారులకే దక్కాలి.

**- గుండా మల్లయ్య, ప్రముఖ నాటక, టీవీ, సినీ నటుడు**

### నంది నాటక పోటీలకు వెళ్లాం..



త్యాగరాజ లలిత కళా పరిషత్తు కళలకు పుట్టిల్లు లాంటిది. ఈ భవనంలో మొట్ట మొదట రిహార్సల్ చేయించింది నేనే. ఒకప్పుడు ఈ భవనంలోనే రిహార్సల్ చేసుకుని నంది నాటక పోటీలకు వెళ్లాం. ఎంతో గొప్పగా నాటకాలు ప్రదర్శించే వాళ్లం. సంస్థ తరపున నాటక పోటీలు కూడా నిర్వహించే వాళ్లం. కళలు అంతరించి పోతున్న క్రమంలో ఈ కళా పరిషత్తును కూడా ఎవరూ పట్టించుకోలేదు. కానీ కూల్చి వేత నిర్ణయం సరైనది కాదు. ఒకప్పటికి జ్ఞాపకార్థానికైనా దీనికి మరమ్మతులు చేసి ఉంచాల్సింది. కళలకు ప్రతిరూపంగా మ్యూజియం లాంటిది ఏర్పాటు చేస్తే బాగుండేది.

**- రాజేంద్రప్రసాద్, నాటక కళాకారుడు**

### కళలకు వేదిక లేకుండా చేశారు..

త్యాగరాజ లలిత కళా పరిషత్తుకు ఒకప్పుడు ఎంతో గొప్ప పేరు ఉండేది. కళాకారులను ప్రోత్సహించే వారు లేక కళలు కనుమరు



గైన పరిస్థితి వచ్చింది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కరీంనగర్‌లో ఈ కళా క్షేత్రం కళలకు నిదర్శనంగా ఉండేది. ఈ భవనాన్ని కూల్చివేసి కళలకు వేదికనేది లేకుండా చేశారు. జ్ఞాపక చిహ్నాన్ని చెరిపేశారు. ఇది చాలా దురదృష్టకరం. ఏ ప్రభుత్వమైనా ఉన్నదానిని కాపాడుకోవాలని చూస్తుంది. కరీంనగర్‌లో మాత్రం అందుకు భిన్నంగా జరిగింది. ఇప్పటికైనా దీనిని పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. ప్రాచీన కళలను ప్రదర్శించే విధంగా, మరుగున పడిన కళలను ప్రోత్సహించాలన్నా, వారసత్వ సంస్కృతిని కాపాడుకోవాలన్నా ఇలాంటి క్షేత్రాలు అవసరం.

**- సొదాల ప్రభాకర్, కళాకారుడు**

### సమాచారం లేకుండా కూల్చివేత

జిల్లా నుంచి గొప్ప గొప్ప కళాకారులను తయారు చేసిన త్యాగరాజ లలిత కళా పరిషత్తు భవనం ఇపుడు కుప్ప కూలింది. ఈ స్థలాన్ని మరో సంస్థకు అప్పగించే ఉద్దేశంలో అధికారులు భవనాన్ని కూల్చి వేసినట్లు కళాకారులు వాపోతున్నారు. కళా పరిషత్తు కమిటీకి గానీ, శాశ్వత సభ్యులుగా ఉన్న తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే భవనాన్ని కూల్చి వేశారని వారు వాపోతున్నారు. 47 ఏండ్ల కింద ఏర్పడిన ఈ కళా పరిషత్తుకు అప్పటి కలెక్టర్ స్థలం కేటాయిస్తే అందులో చందాలు పోగు చేసి భవనాన్ని నిర్మించుకున్నామని, ఈ భవనాన్ని కూల్చి వేయడం అన్యాయమని అంటున్నారు. ఒక కళా సంస్థకు ఇచ్చిన స్థలాన్ని ప్రభుత్వ యంత్రాంగం ఏక పక్షంగా మరో సంస్థకు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపిస్తున్నారు. కళా సంస్థలు, సమాఖ్యలు కలిసి నిర్మించుకున్న ఈ భవనం ప్రభుత్వానిది కాదని, ఒక రిజిష్టర్ కల్చరల్ సొసైటీకి సంబంధించినదని స్పష్టం చేస్తున్నారు. కరీంనగర్ జిల్లా సాంస్కృతిక సంస్థల కళాకారుల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు వైఎస్ శర్మ, నాటక, టీవీ, సినిమా నటులు కేతిరెడ్డి మల్లారెడ్డి, గుండ మల్లయ్య, కేతిరి సుధాకర్ రెడ్డి, పెద్దపల్లి రాజేంద్ర ప్రసాద్, పంజాల రాంనారాయణ తదితరులు అధికారుల చర్యను తీవ్రంగా ఖండిస్తున్నారు. కూల్చిన చోటనే నూతన భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

### తిరిగి నిర్మించకుంటే ఆందోళనలు

ఎందరెందరో గొప్ప కళాకారులను తీర్చిదిద్దిన త్యాగరాజ లలిత కళా పరిషత్తు భవనం ఇప్పటికే నేలమట్టమైంది. నిజానికి నిర్వహణ లేక పోవడంతో భవనం శిథిలావస్థకు చేరింది. పది రోజులుగా ఈ భవనాన్ని అధికారులు కూల్చి వేస్తున్నారు. ఈ స్థలంలో మరో ప్రభుత్వ రంగ సంస్థకు సంబంధించిన భవనాన్ని నిర్మించాలని అధికారులు ప్రయత్నిస్తున్నారని కళాకారులు ఆరోపిస్తున్నారు. కొందరు కింది స్థాయి అధికారులు జిల్లా ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇవ్వడం వల్లే ఈ భవనాన్ని కూల్చి వేసేందుకు సిద్ధమయ్యారని ఆరోపిస్తున్నారు. నిజానికి ఈ భవనం ప్రభుత్వ నిధులతో నిర్మించినది కాదని, అప్పట్లో అన్ని సంస్థలకు కేటాయించినట్లే కేవలం స్థలం మాత్రమే ప్రభుత్వం కేటాయించిందని కళాకారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో త్యాగరాజ లలిత కళా పరిషత్తు భవనాన్ని తిరిగి ఇదే స్థలంలో నిర్మించాలని, అంతే కాకుండా అంతరించి పోతున్న కళలు ప్రతిబింబించే విధంగా ఒక కల్చరల్ మ్యూజియం, ఆర్ట్ గాలరీని, కళాకారులకు వసతి గృహాన్ని ఇక్కడే నిర్మించాలని కళాకారులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరిస్తున్నారు. అంతే కాకుండా జిల్లా స్థాయిలో సమస్య పరిష్కారంకాకుంటే రాష్ట్ర స్థాయిలో సమస్యను లేవనెత్తేందుకు కూడా తాము సిద్ధంగా ఉన్నామని ప్రముఖ నటులు కేతిరెడ్డి మల్లారెడ్డి, గుండా మల్లయ్య తదితరులు స్పష్టం చేస్తున్నారు.

# కేసీఆరే మా నాయకుడు

- ఎమ్మెల్సీ కవిత పార్టీ పెట్టడమనేది ఊహాగానాలే
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- ఆరెపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కార్పొరేషన్, మే 25: ' పార్టీ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆరే మాకు నాయకుడు. ఆయన బాటలోనే ప్రతి ఒక్క కార్యకర్త నడుచుకుంటారు. ఆదేశాలు పాటిస్తారని' మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కవిత పార్టీ పెట్టడమనేది ఊహాగానాలేనని కొట్టిపడేశారు. ఆదివారం నగరంలోని 20వ డివిజన్ ఆరేపల్లిలో శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు, కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, మాట్లాడారు. ఆరెపల్లిలో శ్మశాన వాటిక లేక ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని సుమారు రూ.49.50లక్షల నిధులతో అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. ఆరేపల్లి నుంచి రాణిపూర్ నగునూరు దుర్గామాత ఆలయానికి వెళ్లే దారిలో రూ.12లక్షలు వెచ్చించి కల్వర్టును నిర్మిస్తామని చెప్పారు. వచ్చే నెల 2న తెలంగాణ ఆవిర్భావం సందర్భంగా అమెరికాలోని డల్లాస్‌లో ఎన్నారైల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహిస్తున్నారని, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు తాను, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ వెళ్తున్నట్లు వివరించారు. బీఆర్ఎస్ ప్రజాస్వామ్య బద్ధంగా ఉన్న పార్టీ అని, ప్రతి ఒక్కరి అభిప్రాయాలను వారు తెలియజేయవచ్చునని చెప్పారు. కానీ ఎమ్మెల్సీ కవిత బహిరంగ లేఖ రాయడం కాకుండా అధినేత కేసీఆర్‌కు వ్యక్తిగతంగా కలిసి విషయాలను చెప్పి ఉంటే బాగుండు అని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలతో తాను కూడా ఏకీభవిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు జంగిలి సాగర్, జంగిలి ఐలేందర్ యాదవ్, దిండిగాల మహేశ్, నాయకులు తుల బాలయ్య, పిల్లి మహేశ్ గౌడ్, మాజీ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ కర్ర సూర్య శేఖర్, మాజీ సూడా డైరెక్టర్ నేతి రవివర్మ, పలువురు బీఆర్ఎస్ నాయకులు, ఆరెపల్లి గ్రామస్తులు ఉన్నారు.

# కాంగ్రెస్ పనైపోయింది

- ఏడాదిన్నరలోనే ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే చందర్




మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని, మే 25: కాంగ్రెస్ పార్టీ పనైపోయిందని, అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చందర్ పేర్కొన్నారు. ఆదివారం గోదావరిఖనిలోని మార్కండేయకాలనీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి హాజరై, ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు అడ్డగోలు మాటలు చెప్పి, అలవికాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన ప్రభుత్వం, పాలనలో ఫెయిల్ అయిందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడం, హామీలపై నిలదీస్తున్న ప్రజల దృష్టిని మరల్చేందుకే కాళేశ్వరం పేరిట కొత్త డ్రామాలు ఆడుతున్నదని దుయ్యబట్టారు. డైవర్షన్ చేసేందుకే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ నేత హరీశ్‌రావుకు నోటీసులు ఇస్తున్నదని దుయ్యబట్టారు. రామగుండంలోనూ ప్రజల దృష్టిని మరల్చేందుకు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి పేరిట కూల్చివేతల పర్వం కొనసాగిస్తున్నారని ఆగ్రహించారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేసే దాకా, సమస్యలు పరిష్కరించేదాకా ప్రజల పక్షాన బీఆర్ఎస్ నాయకులు, గులాబీ సైన్యం పోరాడుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. రాబోయే రామగుండంలో పార్టీని మరింత బలోపేతం చేసుకొని స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించే దిశగా కృషిచేయాలని సూచించారు. అలాగే పలు అంశాలపై సమావేశంలో తీర్మానించారు. ఇక్కడ రామగుండం మాజీ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, నాయకులు గోపు ఐలయ్యయాదవ్, నడిపెల్లి మురళీధర్‌రా వు, మారుతి, కల్వచర్ల కృష్ణవేణి, బాదే అంజలి, ముదాం శ్రీనివాస్, పర్లపల్లి రవి, కవితా సరోజని, కాల్వ శ్రీనివాస్, ఈదునూరి పర్వతాలు, ఆనంద్ ఉన్నారు.

## ధూపదీప నైవేద్యానికి 307 దరఖాస్తులు

మారుతీనగర్, మే 25 : ధూపదీప నైవేద్య పథకానికి ఇటీవల దేవాదాయ శాఖ దరఖాస్తులను ఆహ్వానించగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 307 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కరీంనగర్ జిల్లా నుంచి 99, జగిత్యాల నుంచి 101, పెద్దపల్లి నుంచి 67,రాజన్నసిరిసిల్ల నుంచి 40 దరఖాస్తులు వచ్చినట్లు ఉమ్మడి జిల్లా కరీంనగర్ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ నాయిని సుప్రియ తెలిపారు. ఆదాయంలేక నిత్య పూజలకు ఇబ్బందులెదుర్కొంటున్న గ్రామ, మున్సిపాలిటీల్లోని ఆలయాలకు ప్రాధాన్యమిస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాల నుంచి 307 దరఖాస్తులు వచ్చాయని, రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఆయా ఆలయాలను సందర్శించి, సమగ్ర విచారణ చేపడుతుందని చెప్పారు. ప్రతిపాదనలను రాష్ట్ర అధికారులకు పంపిస్తామని, తుది జాబితా రాష్ట్ర శాఖ నుంచే జారీ అవుతుందని వివరించారు. కాగా, దరఖాస్తులకు గడువు ఈనెల 24 నాటికి ముగిసింది.

# ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదు

- రైతులను ఆదుకోకుంటే గుణపాఠం చెబుతరు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు



బీర్‌పూర్ మండలంలోని నర్సింహులపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి వివరాలు తెల్సుకుంటున్న జిల్లా అధ్యక్షులు, జిల్లా జడ్పీ మాజీ చైర్మెన్, నాయకులు

సారంగాపూర్, మే 25: ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేసి, వెనువెంటనే కొనకపోతే ప్రభుత్వంపై రైతుల తిరుగుబాటు తప్పదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు పేర్కొన్నారు. కల్లాల్లోకి రాజకీయం చేయడానికి రాలేదని, కర్షకుల కష్టాన్ని చూసి వచ్చామని చెప్పారు. ఆదివారం బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లెలోని ఐకేపీ, సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపు రెడ్డితో కలిసి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో రైతులు అరిగోస పడుతుంటే, అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దయి కన్నీళ్లు పెడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి అందాల పోటీలు నిర్వహించడం సరికాదన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని, లేదంటే రైతుల తిరుగుబాటు తప్పదని, గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయానికి 24 గంటల కరెంటు, నీళ్లు ఇచ్చి, పండిన పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకున్న ఘనత కేసీఆర్‌దేనని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలాంటి ప్రోత్సాహం లేకున్నా రైతులు కష్టపడి పంట పండిస్తే సకాలంలో కొనుగోలు చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆగ్రహించారు. ఓట్ల కోసం ప్రతి ఇల్లు తిరిగిన నాయకులు రైతులకు కష్టాలొస్తే ఇప్పుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు బీఆర్ఎస్ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఇక్కడ సారంగాపూర్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు తెలు రాజు, మాజీ పాక్స్ చైర్మన్ మెరుగు రాజేశం, మాజీ సర్పంచ్ భూమన్న, పాక్స్ డైరెక్టర్ సతీశ్, నాయకులు సుధాకర్, శ్రీనివాస్, సుదర్శన్ లక్ష్మీ నారాయణ, సుధ రమేశ్, రాజేందర్ ఉన్నారు.